వీడని 'లంచం' పీడ!

- మారని కొందరి ప్రభుత్వ అధికారుల తీరు..
- ప్రతీ పనికి డబ్బులు డిమాండ్
- లక్సెట్టిపేట మున్సిపల్ కార్యాలయంలోనూ ఇదే తంతు..
- ఇంటి నంబర్ కోసం డబ్బులు వసూలు చేసిన వైనం


లంచం తీసుకుంటుండగా పట్టుబడిన శ్రీహరి, మహేందర్‌తో ఏసీబీ అధికారులు (ఫైల్)


లక్సెట్టిపేట మున్సిపల్ కార్యాలయం

లక్సెట్టిపేట: ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా లంచం మహమ్మారి మాత్రం మారడం లేదు. ఉద్యోగం వచ్చేంత వరకు పోరాటం, ఉద్యోగం వచ్చిన తర్వాత అవినీతికి పాల్పడుతున్న వారు సమాజంలో చాలా మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. విధులకు హాజరుకాకుండా సమయపాలన పాటించకుండా తను చేయాల్సిన పనికి లంచం ఇస్తేనే చేస్తానని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజలను పీక్కుతింటున్నారు. పేదవారి నుంచి బడా వ్యాపారుల వరకు లంచాలకు బలైపోతున్నారు.

మున్సిపల్ కార్యాలయంలో పక్కా భవనం నిర్మాణానికి అనుమతికి, ఇంటి నంబర్‌కు, నల్లా కనెక్షన్లకు, ఇళ్లు మార్పిడికి ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వేల నుంచి లక్షల వరకు డబ్బులు దండుకుంటున్నట్లు తెలుస్తోంది. మధ్యవర్తులు, దళారులతో వస్తే వారికి నచ్చడం లేదని, నేరుగా వచ్చి మాట్లాడుకోవాలని లేకపోతే కిందిస్థాయి సిబ్బందితో వారికి నచ్చిన వారితో వ్యవహారాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. కమిషనర్‌కు తెలియకుండా వ్యవహరిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లంచగొండితనాన్ని ఎదిరించి వారిని పట్టించేంత ధైర్యం లేక కొందరు, పట్టిస్తే పనులు కావని మరికొందరు, మనకెందుకులే అని ఇంకొందరు ఇలా అందరూ అనుకోవడంతో అవినీతికి, లంచానికి ఎదురులేకుండా పోతోంది. ప్రభుత్వం, అధికారులు అవినీతి, లంచగొండి తనంపై దృష్టిపెట్టి నిర్మూలించేందుకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

మండలంలో జరిగిన ఘటనలు

- 2009వ సంవత్సరంలో రెవెన్యూ వీఆర్వో రూ.3000 లంచం తీసుకుంటుండగా బస్టాండ్ వద్ద పట్టుకున్నారు.
- 2011వ సంవత్సరంలో మరో రెవెన్యూ రికార్డు అసిస్టెంట్ రూ.4000 తీసుకుంటుండగా పట్టుకున్నారు.
- 2012వ సంవత్సరంలో వైద్యాధికారి మెడికల్ సర్టిఫికెట్ కోసం రూ.5000 ఇస్తుండగా పట్టుబడ్డారు.
- 2014వ సంవత్సరంలో మరో వైద్యాధికారి మెడికల్ సర్టిఫికెట్‌కు రూ.4000 తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.
- ఈ నెల 17వ తేదీన మున్సిపల్ బిల్ కలెక్టర్ మహేందర్, మేనేజర్ శ్రీహరి ఇంటి నంబరు కోసం రూ.15000 తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

సమాచారం ఇవ్వండి



లంచం అడిగితే సమాచారం ఇవ్వండి. లంచం తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజల్లో చైతన్యం రావాలి. ఎవరైనా లంచం అడిగితే 91543 88963 నంబరుకు ఫోన్ చేయండి.

– వి. రమణామూర్తి, ఏసీబీ డీఎస్పీ

కార్మికులకు అండగా ఉంటా

- కొత్త బొగ్గుబాయిలు తీసుకొస్తాం
- మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు


కాంగ్రెస్‌లోకి చేర్చుకుంటున్న కొక్కిరాల ప్రేంసాగర్‌రావు

శ్రీరాంపూర్/మంచిర్యాలటౌన్: కార్మికులకు ఏ సమస్య వచ్చినా ఎళ్లవేళలా అందుబాటులో ఉంటానని మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు తెలిపారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన ఐఎన్‌టీయూసీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒక్కసారి అవకాశం ఇచ్చి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కొత్త గనులు తీసుకొచ్చి కొత్త ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. రిటైర్డ్ కార్మికులకు పాత క్వార్టర్లు కేటాయిస్తామన్నారు. సింగరేణి ప్రాంతంలో ఇంకా పట్టాలు రాని ఇళ్లకు పట్టాలిప్పిస్తామన్నారు. అనంతరం ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ మాట్లాడుతూ.. మంచిర్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. సింగరేణి ప్రైవేటీకరణ కాకుండా ఉండాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు, జిల్లా కేంద్రానికి చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షులు కలవేని శ్యాం, రాంశెట్టి నరేందర్, బ్రాంచీ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు, డెప్యూటీ జనరల్ సెక్రెటరీలు గరిగే స్వామి, భీంరవి నాయకులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌కు బల(గ)ం పెరుగుతోంది'

దండేపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వ తీరు నచ్చక చాలా మంది కాంగ్రెస్‌లో చేరుతున్నారని, దీంతో కాంగ్రెస్ పార్టీకి బలం, బలగం పెరుగుతోందని ప్రేంసాగర్‌రావు అన్నారు. మండలంలోని కొండాపూర్, లక్ష్మీకాంతపూర్, పెద్దపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం లక్ష్మీకాంతపూర్‌లో రోడ్డు పక్కన పోచమ్మతల్లికి మొక్కుకుని, ఎన్నికల్లో బారీ మెజారిటీతో గెలవాలని కోరుకున్నారు.


శ్రీరాంపూర్: మాట్లాడుతున్న ప్రేంసాగర్‌రావు

నస్పూర్: సింగరేణి నిధులను వేరే ప్రాంతాలకు తరలించకుండా ఈ ప్రాంత అభివృద్ధికి మాత్రమే వెచ్చిస్తామని ప్రేంసాగర్‌రావు తెలిపారు. సీసీసీ కార్నర్ వద్ద సింగరేణి కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. సింగరేణి సంస్థను ప్రైవేటు పరం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయని విమర్శించారు.

ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు

- మంచిర్యాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు

దండేపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రతి ఇంటికీ ఏదో ఒక ప్రభుత్వ పథకం అందిందని మంచిర్యాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు అన్నారు. మండలంలోని మేదరిపేటలో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల ప్రచార సభను నిర్వహించారు. ఈ సందర్భంగా దివాకర్‌రావు మాట్లాడారు. వ్యవసాయానికి 24గంటల కరెంట్, వృద్ధులకు, వితంతువులు, దివ్యాంగులకు ఆసరా పథకం ద్వారా పింఛన్లు, రైతులకు రైతుబంధు, రైతుబీమా వంటి ఎన్నో సంక్షేమ పథకాలను అందించిన ఘనత బీఆర్‌ఎస్‌దే అని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ కారుగుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించి అధికారంలోకి తేవాలన్నారు. డీసీఎమ్మెస్ చైర్మన్ లింగన్న, రైతుసమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, వైస్‌ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్ లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ రమేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం శ్రీ లక్ష్మీ నారాయణస్వామిని దర్శించుకున్నారు. ఎన్నికల్లో మళ్లీ గెలవాలని దేవుడిని మొక్కుకుని అర్చకుడి వద్ద ఆశీర్వచనం తీసుకున్నారు.


దండేపల్లి: మాట్లాడుతున్న దివాకర్‌రావు


ప్రచారం చేస్తున్న దివాకర్‌రావు కోడలు ఉదయశ్రీ

'బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమం, అభివృద్ధి'

మంచిర్యాలటౌన్: అన్ని వర్గాలకు చెందిన ప్రజలకు సంక్షేమం అందాలన్నా, అభివృద్ధి జరగాలన్నా అది కేవలం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని 9వ వార్డు పాతమంచిర్యాల, రంగంపేట్, 27వ వార్డు గౌతమినగర్, రాళ్లపేట్‌లలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. నడిపెల్లి దివాకర్‌రావుకు సహాయంగా ఆయన సతీమణి నడిపెల్లి రాజకుమారి, కుమారుడు నడిపెల్లి విజిత్‌రావు, కోడలు నడిపెల్లి ఉదయశ్రీ ఎన్నికల ప్రచారాన్ని చేపడుతున్నారు. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ఎన్నికల ప్రచారం చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు.

ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి చేస్తా

- ఖానాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్

ఖానాపూర్: తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఖానాపూర్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలో మార్నింగ్‌వాక్ చేస్తూ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాజేందర్, రాము నాయక్, కరిపె శ్రీనివాస్, వెంకట్‌మహేంద్ర, ప్రదీప్, రవి, సుమిత్ తదితరులు ఉన్నారు.

కడెం: మండలంలోని కన్నాపూర్ గ్రామంలో ఏఎంసీ డైరెక్టర్ బోయిని మంగ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి జాన్సన్ నాయక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఖానాపూర్: ప్రచారం చేస్తున్న జాన్సన్‌నాయక్, నాయకులు

క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ఏరియా కమిటీ


సుదర్శన్

మందమర్రిరూరల్: సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఏరియా కమిటీ ఎన్నిక ఏరియాలోని సంఘం కార్యాలయంలో ఆ సంఘం డిప్యూటీ జనరల్ సెక్రెటరీ తిరుపతి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఏరియా ఉపాధ్యక్షుడిగా దాసరి సుదర్శన్, కార్యదర్శులుగా నాయిని శ్రీనివాస్, రామటెంకి వెంకటయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా పురుషోత్తం, కోశాధికారిగా యేడుకోలు శ్రీనివాస్, అసిస్టెంట్ సెక్రెటరీలుగా సీపెల్లి రాయలింగు, రాజేందర్, లింగాల కిరణ్, ఈద పోచయ్య, వీన్‌రా మారావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా కందేరా జీకుమార్, రాదండి లక్ష్మణ్, అరుగురాల రాజ్‌కుమార్, చిలుముల నర్సయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జీలుగా మంతెన భాస్కర్, సంగి రవికుమార్, అలాగే కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులుగా జీడి బాపు, ఆసం శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా డాక్టర్ రాజేశ్వర్ హాజరై కమిటీని ప్రకటించారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి


నినాదాలు చేస్తున్న నాయకులు

లక్సెట్టిపేట: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని మండలంలోని నాయకులు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చింత అశోక్, ఎండీ ఆరీఫ్, రాయలింగు, స్వామి, కిషన్, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ


తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

కాసిపేట: కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చొప్పరివల్ల టోల్‌ప్లాజా చెక్‌పోస్టు వద్ద ఎన్నికల నేపథ్యంలో ఆదివారం వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి చెక్‌పోస్టును సందర్శించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు లోబడి నగదు తరలింపులో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తనిఖీ చేసే సమయంలో సిబ్బందికి సహకరించాలని, రూ.50వేలకు మించి నగదు ఉన్నట్లయితే పూర్తి ఆధారాలు చూపించాలన్నారు. తనిఖీ చేసే సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఎస్సీ విద్యార్థులకు స్వెట్టర్స్ అందజేత


విద్యార్థులకు స్వెట్టర్స్, బూట్లు అందిస్తున్న అధికారులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఎస్సీబాలుర వసతి గృహం విద్యార్థులకు ఆదివారం స్వెట్టర్స్, స్పోర్ట్స్ మెటీరియల్ పంపిణీ చేశారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వసతి గృహంలో ఉండి పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు చలి తీవ్రతను తట్టుకునేందుకు, క్రీడల్లో రాణించేందుకు ఉపయుక్తంగా ఉంటుందనే ఉద్దేశంతో స్వెట్టర్స్, క్రీడా పోటీల నిర్వహణ కోసం స్పోర్ట్స్ షూస్‌ను అందించినట్లు షెడ్యూల్డ్ కులాల జిల్లా ఉపసంచాలకులు పి.రవీందర్ రెడ్డి తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ ఆల్‌ఇన్ వన్ పుస్తకాలను సరఫరా చేసినట్లు తెలిపారు. విద్యార్థులు చదువులో, క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఎం.రవీందర్, వసతి గృహం సంక్షేమ అధికారి వి.విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

'నోటుకు ఓటు అమ్ముకోవద్దు'


ప్రచారం చేస్తున్న జైభారత్ సభ్యులు

మంచిర్యాలటౌన్: నోటుకు ఓటు అమ్ముకుంటే ఐదేళ్ల భవిష్యత్తు అధోగతేనని, ఓటు అమ్ముకున్నవారు శవంతో సమానమంటూ ఆదివారం జై భారత్ సంస్థ సభ్యులు జిల్లా కేంద్రంలో పోస్టర్లను విడుదల చేసి, ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో నాయకులు చూపే డబ్బుకు ఆశ పడితే మరో ఐదేళ్లు మోసపోవడం ఖాయమని, ధన ప్రలోభంతో ఓట్లను కొనుగోలు చేసేందుకు పలువురు ప్రయత్నిస్తారని, ప్రజాస్వామ్య పరిరక్షణపై ఓటర్ల బాధ్యతను చాటిచెప్పాలనే ఉద్దేశ్యంతో ప్రచారం చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు సుధాకర్, ఆంజనేయులు, కిరణ్, సంతోశ్ పాల్గొన్నారు.

జాతీయ మానవ హక్కుల కార్యాలయం ప్రారంభం


ప్రారంభిస్తున్న అనంతుల శ్రీనివాస్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని చున్నంబట్టివాడలో ఆదివారం జాతీయ మానవ హక్కులు, మహిళా, శిశు సంరక్షణ జిల్లా కార్యాలయాన్ని ఫౌండర్, చైర్మన్ అనంతుల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సంస్థ ద్వారా సామాన్య, మధ్య తరగతి ప్రజల హక్కులను కాపాడడంలో ముందుంటామని, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా తాము పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోరె శ్రీనివాస్, సభ్యులు మల్ల శ్రీనివాస్, రాసపెల్లి కుమార్, రాజమొగిలి, తిరుపతి, రమేశ్, ప్రభాకర్, శ్రీకాంత్, మణికంఠ, రాజు, రాజేందర్, యశ్వంత్, సంపత్ పాల్గొన్నారు.

ఎండుతున్న మొక్కలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల క్రీడా మైదానంలో ఇటీవల హరితహారంలో భాగంగా నాటిన మొక్కలకు నీరు పోయక ఎండి పోతున్నాయి. ఎన్నికల విధుల్లో అధికారులు బిజీగా ఉండడం, మొక్కలకు నీరు పోస్తున్నారో లేదో పట్టించుకోకపోవడంతో నాటిన మొక్కలు ఎండుతున్నాయి. వర్షాకాలం పూర్తయ్, చలికాలం ప్రారంభంలో ఉండగా, మధ్యాహ్నం ఎండ వేడి ఎక్కువగా ఉంటుంది. దీంతో మొక్కలకు నీరు అందక, ఎండ వేడికి ఎండుతున్నా, పట్టించుకునే వారు లేరు. మొక్కలకు నీరు పోయకుంటే, నాటిన మొక్కలు మొత్తం ఎండిపోయే అవకాశం ఉందని, మొక్కలకు నీరు పోసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


క్రీడా మైదానంలో ఎండుతున్న మొక్కలు

'కార్మికుల పర్మినెంట్‌కు చర్యలు తీసుకోవాలి'

పాతమంచిర్యాల: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల పర్మినెంట్‌కు చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.బ్రహ్మనందం అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వినోద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి చాంద్‌పాషా, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లాల్‌కుమార్ పాల్గొన్నారు.


ఆసుపత్రి ఎదుట మురుగు నీటిలో సేదతీరుతున్న గేదెలు


ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట నిలిచిన మురుగు నీరు

ఆసుపత్రి చుట్టూ మురుగునీరే...

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్‌నగర్‌లో గల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆయుష్మాన్ భారత్ కేంద్రం ఎదుట మురుగు నీరు రోజుల తరబడి నిల్వ ఉండి దుర్వాసన వస్తోంది. ఆసుపత్రి గేటును ఆనుకుని ఉన్న డ్రెయినేజీలోని నీరు బయటకు వెళ్లలేని పరిస్థితిలో ఉండడంతో, ఆకుపచ్చ రంగులోకి మారి, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఆసుపత్రి ఎదుట డ్రెయినేజీ లేకపోవడంతో, రోడ్డుపై నిలిచిన మురుగునీటిలో గేదెలు సేదతీరుతున్నాయి. ఆసుపత్రి ప్రహరీ పక్కనే చెత్తను వేయడం, తిన్న విస్తళ్లు వేయడంతో పశువులు వాటిని తింటూ ఆసుపత్రి పరిసరాల్లోనే తిరుగుతున్నాయి. ఆరోగ్యాన్ని అందించాల్సిన ఆసుపత్రి చుట్టూ, రోగాలు వచ్చేలా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థను బాగు చేసేలా చర్యలను తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ఆసుపత్రి ప్రహరీ పక్కన చెత్త, వాడిన విస్తళ్లు వేయడంతో వాటిని తింటున్న పశువులు

నిరుపేద కుటుంబాలకు ఆర్థిక చేయూత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల ఆల్ టూ వీలర్స్ మెకానిక్ సొసైటీ ఆధ్వర్యంలో మెకానిక్ జ్యోతి–శంకర్‌ల కుమార్తె అంజలి వివాహానికి ఆదివారం రూ.40 వేలు ఆర్థిక చేయూత అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర మెకానిక్‌ల సంఘం అధ్యక్షుడు తోడేటి బాబు, ఉపాధ్యక్షుడు జాఫర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలిమెల చంద్రమౌళి, పట్టణ మెకానిక్‌లు రవీందర్, శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మందమర్రిలో...

మందమర్రిరూరల్: పట్టణంలోని అంగడిబజార్ సీఎస్పీ రోడ్డు ప్రాంతానికి చెందిన పాగిడి రాంబాబు కూతురు గంగోత్రి వివాహానికి మేముసైతం స్వచ్ఛంద సంస్థ సభ్యులు దాతల నుంచి సేకరించిన రూ.11వేలు నగదు, 25కిలోల బియ్యం అందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు బూబత్తుల శ్రీనివాస్, సభ్యులు సోమయ్య, రవి, ఆరంగపాణి, సాయికృష్ణ ఉన్నారు.